నవతెలంగాణ

1

ఆదిలాబాద్

శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

ప్రధానోపాధ్యాయుడి ఇంట్లో చోరీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంట్లో ఎవరు లేని సమయంలో ఓ ప్రధానోపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మావలలోని గ్రీన్ సిటీ కాలనీలో భీంపూర్ మండలం గోనె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.ఉపేందర్ నివాసం ఉంటున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం సమయంలో ఎవరు లేని సమయంలో దుండగుడు ఇంటి తాళం పగలకొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగ ప్రహారిగోడ దూకి లోనికి వెళ్లినట్టు సీసీ ఫుటేజీ లభించింది. తులంన్నర బంగారం చోరీ జరిగినట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని మరో లారీ డ్రైవర్ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరజ్ నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్తున్న లారీ మావల బైపాస్ దాటిన తర్వాత అక్కడ జాతీయ రహదారిపై ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అజాగ్రత్తగా రోడ్డుపై వాహనం నిలిపి వేయడంతో అటుగా వస్తున్న లారీ కంట్రోల్ కాకపోవడంతో ఆ లారీని ఢీకొట్టారు. మృతుడు అజీమ్ అహ్మద్ షేక్ కిన్వట్ తాలూకాగా గుర్తించారు. జాతీయ రహదారిపై అజాగ్రత్తగా నిలిపిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కస్తూరి శోభారాణి, గ్రామ కారోబారి బీఆర్ఎస్ నాయకులతో భోజనాలు చేయించి, పార్టీ నాయకులతో కలిసి భోజనం చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, విధుల నుంచి తొలగించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టర్, ఎన్నికల అధికారి రాజర్షిషాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ఉన్నటువంటి వారితో పోలింగ్ బూత్‌లోనే ఓటర్లను ప్రభావితం చేసేలా భోజనాలు ఏర్పాటు చేయించి, వారితో కలిసి భోజనాలు చేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శి కస్తూరి శోభారాణి, కారోబారి రమాకాంత్‌లను వెంటనే విధుల నుంచి తొలగించాలని విన్నవించారు. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో ఈ సంఘటన నేపథ్యంలో పోలింగ్ బూత్‌లోనే సెక్టార్ అధికారి తిరుపతికి లిఖితపూర్వకంగా ఫోటోలు వీడియోలు ఆధారంగా ఫిర్యాదు చేసినట్లు, సంఘటన స్థలంలోనే ఏపీ ఎస్సై కూడా ఉన్నారని విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తలమడుగు మండల ఎంపీడీఓ, ఎంపీఓ, కజ్జర్ల గ్రామ ప్రత్యేక అధికారులకు విన్నవించిన ఇప్పటివరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోలేదని ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాజకీయ ప్రలోభాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నిజనిర్ధారణ జరిగిన తర్వాత చర్యలు తీసుకోలేని పక్షంలో దశలవారీగా ఉద్యమించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ధర్మసమాజ్ పార్టీ తరపున ఉద్యమిస్తామని జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, శ్యామల, మంజూష, సాయి, వి.సురేష్, శ్రీనివాస్, రాకేష్ ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



నవతెలంగాణ-బోథ్

రైతులకు నాణ్యమైన పత్తి, సోయాబిన్ విత్తనాలను ప్రభుత్వం సర్టిఫాయిడ్ చేసిన విత్తనాలు అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ అవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులో మహారాష్ట్ర ఉండటంతో నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నాయని అన్నారు. దీనిపైన జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అలాగే విజిలెన్స్, టాస్క్ పోర్స్ అధికారులు కలిసి నకిలీ విత్తనాలు అమ్ముకునే వారిపైన దృష్టి సారించాలని అన్నారు. రైతులు తీసుకునే విత్తనాల రకాలు రాసి 659, మనిమేకర్, ప్లాటినం, చంద్ర గోల్డ్, రాసి 797 సోయాబిన్‌లో ఉన్న రకాలు కూడా గ్రీన్ గోల్డ్, ఈగల్‌లతో పాటు వివిధ రకాలైన విత్తనాలను రైతుకి భరోసా ఉండే విధంగా విత్తనాలు అందించాలని అన్నారు. మరోపక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విత్తన రాయితీ చట్టాన్ని అములు చేసేవిదంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో రైతులు రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ, స్వామి, నవీన్ పాల్గొన్నారు.

విద్యాసంవత్సరం ఘనంగా ప్రారంభించాలి

నవతెలంగాణ-బేల

జూన్ 12న ప్రారంభం కానున్న నూతన విద్యా సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు ముగిసినందున అలాగే పదోన్నతులకు ఆటంకాలు తొలిగినందున ఎన్నికల కమీషన్ అనుమతి తీసుకుని ప్రభుత్వం బదిలీలు పదోన్నతుల మార్గదర్శకాలు రూపొందించాలని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మేరకు విద్యా వాలంటీర్లను నియమించాలనీ, పాఠశాలల పచ్చదనం, పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులను నియమించాలని, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పూర్తిస్థాయిలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎన్నికల నిర్వాహణ సందర్భంగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వ నిబంధనల మేరకు రెమ్యునరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఇ.శివన్న, సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్, బేల మండల అధ్యక్షులు ఎం.జయకర్ పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే..!

- బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలపై ఆరా
- గెలుపుపై లెక్కలు వేసుకుంటున్న ప్రధాన పార్టీలు
- ఉత్కంఠ రేపుతున్న ఆదిలాబాద్ లోక్‌సభ ఫలితం
- లోక్‌సభ పరిధిలో పోలైన ఓట్లు 12.21లక్షలు

ఆదిలాబాద్ లోక్‌సభ ఫలితం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. పోలింగ్ ముగియగానే ఆయా ప్రధాన పార్టీలు గెలుపుపై ఎవరికి వారు విశ్వాసాన్ని వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ పూర్తయిన వెంటనే ఆయా సర్వేల ఆధారంగా వచ్చిన సమాచారం బట్టి గెలుపు తమదంటే తమదేనని గట్టి నమ్మకం వ్యక్తం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. బూత్‌ల వారీగా పోలైన ఓట్లు.. ఎక్కడెక్కడ ఎవరికి అధిక ఓట్లు పడ్డాయి..ఎక్కడ మైనస్ ఉంది తదితర వాటిని ముందుగానే ఒక అంచనాకు వస్తున్నారు. వీటితో పాటు ఆయా సామాజిక వర్గాల వారీగా పోలైన ఓట్లు ఎవరికి అనుకూలంగా ఉన్నాయి..ప్రతికూలమెవరికీ.. తదితర వాటిపైనా విశ్లేషణలు సాగించారు. ఫలితాలు రాకముందే ఆయా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీలు పోలైన ఓట్లు.. పార్టీలు చేయించిన సర్వేల ఆధారంగా వారీగా లెక్కలు వేసుకొని గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో 16.50లక్షల ఓటర్లు ఉండగా ఇందులో 12.21లక్షల ఓట్లు పోలయ్యాయి. వీటి ఆధారంగా ఆయా పార్టీలు గెలుపోటములపై ఒక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.



పార్టీ నాయకులతో సమాలోచనలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ ఎన్నికల సమరం పూర్తయింది. ఈ లోక్‌సభ పరిధిలో 74.03శాతం పోలింగ్ నమోదైంది. గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈ సారి పోలింగ్ శాతం పెరిగింది. దీంతో పోలింగ్ పూర్తయిన వెంటనే ఆయా ప్రధాన పార్టీలు గెలుపుపై లెక్కలు వేసుకున్నాయి. పెరిగిన పోలింగ్‌శాతం కూడా అనుకూలంగా మారుతుందని ఎవరికి వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ లోక్‌సభ పరిధిలో 12మంది అభ్యర్థులు పోటీ చేసినా ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే ఉంటుందనే అభిప్రాయం ఉంది. మిగతా బీఎస్పీ, డీఎస్పీతో పాటు పలువురు స్వతంత్రులు పోటీపడినా వారికి నామమాత్రపు ఓట్లు మాత్రమే వస్తాయని అంచనా వేస్తున్నారు. పోలింగ్ జరుగుతుండగానే వివిధ సంస్థలు, వారి మనుషులతో సర్వేలు చేయించిన ప్రధాన పార్టీలు పోలింగ్ ముగిసిన వెంటనే ఒక కన్‌క్లూజన్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. మరుసటి రోజున అధికారికంగా పూర్తి పోలింగ్‌శాతం రావడం..నియోజకవర్గాలు..బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు తేలడంతో వాటిని అనుసరించి ఎవరికి ఎన్ని వస్తాయో లెక్కలు వేసుకుంటున్నారు. వీటిని బట్టి గెలుపుపై ముందుగానే అంచనా వేసి గెలుపు సంబరాలు నిర్వహించడం..నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలపడం సర్వత్రా ఆసక్తి రేపుతోంది. మూడు పార్టీలు సైతం తామంటే..తాము గెలుస్తామని చెబుతుండటంతో ప్రజల్లోనూ ఫలితం తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తోంది.



మాజీ మంత్రి జోగు రామన్న, పార్టీ నాయకులతో కలిసి లెక్కలు వేసుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు

మూడు పార్టీల్లోనూ ధీమా..!

ఆదిలాబాద్ లోక్‌సభను కైవసం చేసుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేస్తోంది. మైనార్టీల ఓట్లు గంపగుత్తగా తమకే వస్తాయని, వీటితో పాటు పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకు, పార్టీకి అనుకూలంగా ఉండే వివిధ వర్గాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతున్న వారి ఓట్లు తమకే కలిసి వస్తాయని సుమారు లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ సైతం విజయంపై ధీమా వ్యక్తం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధితో పాటు గ్రామాల్లో పార్టీకి బలమైన క్యాడర్ ఉండటం..ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినా..మిగతా పార్టీల కంటే అధికంగా ఓట్లు సాధించడంతో తాజా లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని నమ్మకంతో ఉన్నారు. బీజేపీ సైతం విజయంపై నమ్మకం పెట్టుకుంది. కేంద్రంలో అధికారంలో ఉండటం..హిందూత్వవాదం, ప్రధాని మోడీ ఛరిష్మాతో పాటు యువత తమవైపే మొగ్గుచూపారని దీంతో విజయం ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు. ఇలా మూడు ప్రధాన పార్టీలు ఎవరికి వారు విజయంపై ధీమా వ్యక్తం చేస్తుండటం జనాల్లో ఆసక్తికరంగా మారుతోంది. జూన్ 4న వెలువడే ఫలితంపై తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ప్రస్తుతం ఏ నలుగురు కలిసినా గెలుపోటములపైనే చర్చిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

స్కానింగ్‌కు కష్టమౌతోంది..!

- రోజుల తరబడి దురుచూపులు
- అత్యవసర పరిస్థితులో ప్రయివేట్‌కు రోగులు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిల్‌లో స్కానింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. రోగులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఒక వైపు పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నా కొన్ని చోట్ల అవి అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. దీనికి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలు సరిగ్గా అందకపోవడమే నిదర్శనం. ఒకప్పుడు సాధారణ రోగులతో పాటు గర్భిణులు సైతం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలు వినియోగించుకునేవారు. మాతాశిశు ఆస్పత్రి ఏర్పాటు కావడంతో గర్భిణులకు మాతా శిశు కేంద్రంలోనే స్కానింగ్ సౌకర్యం చేశారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ రోగులకు మాత్రమే స్కానింగ్ తీస్తున్నారు. నిత్యం వందలాది మంది వచ్చే ఈ ఆస్పత్రిలో అదే సంఖ్యలో స్కానింగ్‌లు ఉంటున్నాయి. కానీ స్కానింగ్ తీయించుకోవాలంటే ఒక్కో రోగికి రెండు మూడు రోజుల సమయం పడుతోంది. రేడియోలాజిస్టులు ప్రయివేట్‌గా స్కానింగ్ సెంటర్లు పెట్టుకొని డ్యూటీ సమయాల్లో మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటున్నారనే విమర్శలున్నాయి. మంచిర్యాల పట్టణం, చుట్టు పక్కల గ్రామాలతో పాటు లక్షెట్టిపేట్, చెన్నూర్ ప్రాంతాల నుండి కూడా రోగులు ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఇక్కడ రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఓపితో పాటు ఇన్‌పేషెంట్‌లకు వైద్యులు స్కానింగ్ రాస్తే గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోల్సి వస్తోంది. కొందరికైతే రెండు, మూడు రోజుల సమయం పడుతోంది. అత్యవసర రోగులు రోజుల తరబడి ఎదురుచూడలేక ప్రయివేట్ స్కానింగ్ సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే రేడియోలాజిస్టులు రోగులు క్యూలో ఉన్నా డ్యూటీ సమయం అయిపోగానే వెళ్లిపోతున్నారని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్కానింగ్ సేవలు మెరుగుపడేలా చూడాలని రోగులు కోరుతున్నారు.



స్కానింగ్ కేంద్రం వద్ద రోగుల సందడి

సేవల మెరుగుకు చర్యలు తీసుకుంటాం : హరీష్ చంద్రారెడ్డి, సూపరింటెండెంట్

ఆస్పత్రిలో స్కానింగ్ విభాగంలో ఇద్దరు రెగ్యులర్ రేడియోలాజిస్టులు పని చేస్తున్నారు. వీరితో పాటు ఎస్ఆర్‌లు వచ్చారు. అదనంగా మెడికల్ కాలేజ్ విద్యార్థులు పని చేస్తున్నారు. స్కానింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వడం లేదు. మరొకసారి పరిశీలించి మెరుగుదలకు చర్యలు తీసుకుంటాం.

మూడు రోజులుగా తిరుగుతున్నా : సత్యనారాయణ, గుడిపేట

కాళ్లు, చేతులకు వాపులు, నొప్పులు వస్తున్నాయని ఆస్పత్రిలో చెకప్ చేయించుకున్నాను. పరీక్షించిన వైద్యులు స్కానింగ్ రాశారు. అక్కడికెళితే సమయం అయిపోయిందని రేపు రమ్మని చెప్పారు. మర్నాడు ఆ తర్వాతి రోజు వరుసగా వచ్చాను. అయినప్పటికీ స్కానింగ్ తీయాలే. ఏమైందని అడిగితే ఆగాలి టైం పడ్తది అని చెబుతున్నారు. రోగులు లైన్‌లో ఉండగానే సార్ వెళ్లిపోయాడు. మళ్లీ రేపు రండి అని చెబుతున్నారు. అధికారులు స్పందించి పేదలకు స్కానింగ్ సేవలు మెరుగయ్యేలా చూడాలి.

నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలు పాటించి, జూన్ 5వ తేది లోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లకు నీటి సరఫరా, స్లాబ్‌ల మరమ్మతులు, ప్రహరీ గోడల మరమ్మత్తులు, వంటి పనులను చేపట్టాలని సూచించారు. పనులు పూర్తి కావడానికి ముందు పూర్తయిన తర్వాత ఫోటోలతో కూడిన వివరాల నివేదికలను పంపాలని ఆదేశించారు. పనుల నిర్వహణకు గ్రామంలోని మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జిగా కేటాయించబడిన అధికారి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగాలని అధికారులను ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్నందున వరి ధాన్యాలు తడవకుండా ఉండేందుకు రైతులకు సరిపడే టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యపు సంచుల కొరత రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వారి ధాన్యపు వివరాలను కచ్చితంగా ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. వరి కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, అవసరమైతే లారీలు, కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. వరి కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మాత్రమే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్యాడీ క్లీనింగ్ మిషన్ల ధాన్యాన్ని శుభ్రపరిచే విధంగా అధికారులు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, జిల్లా సహకార శాఖ అధికారి నర్సయ్య, ఎంపీడీఓలు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని 33/11 కేవీ కైలాస్‌నగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని శాంతినగర్ ఏరియా, కైలాస్‌నగర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, ఆర్‌ఆర్ నగర్, కుమ్మరివాడ, అటెండర్ కాలనీలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయనికి సహకరించాలని కోరారు.

కడెం : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు మండలంలోని లింగాపూర్, బెల్లాల్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్తు లైన్‌ల మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సుమన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాదిగూడ కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు శుక్రవారం ఎస్‌ఓ పి.ప్రియాంక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో 46 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభమైనట్టు తెలిపారు. అడ్మిషన్ తీసుకొనే విద్యార్థినిలు బోనాఫైడ్, ఎస్ఎస్‌సీ షార్ట్ మేమోతో పాఠశాలలో హాజరుకావాలని కోరారు. విద్యార్థినులకు హాస్టల్ వసతితో పాటు ఉచిత యూనిఫాం, నోట్ బుక్స్, పుస్తకాలు అందించబడుతోందని తెలిపారు. ఈసారి పాఠశాలలో పదో తరగతిలో వందశాతం ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ఐదో తరగతి, పదో తరగతి పాసైన విద్యార్థినుల తల్లిదండ్రులు గమనించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందేహాలకు ఫోన్ నెంబర్ 7816061175ను సంప్రదించాలని సూచించారు.

తరుచూ వానజల్లులు.. వరి కోతలకు ఇబ్బందులు

- ఆందోళనలో అన్నదాత



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

వారం రోజుల నుంచి తరుచూ ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వానలు వరి కోతలకు ఆటంకంగా మారాయి. ఐదు రోజుల కింద కురిసిన భారీ వర్షానికి వరిపంటలు నేలకొరిగాయి. అంతేకాకుండా పొలాలు తడిగా మారడంతో సదర్‌మాట్ కింద ఉన్న వరిపొలాల్లో హార్వెస్టర్ నడువలేని పరిస్థితి నెలకొంది. ఈ పాటికే పూర్తి కావాల్సిన వరి కోతలు సదర్‌మాట్ నీటి విడుదలలో జరిగిన జాప్యం, ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా ఆలస్యమైనాయి. అలాగే మూడు, నాలుగు రోజుల నుంచి పడుతున్న జల్లుల కారణంగా కోత మిషన్‌లు నడువలేని పరిస్థితి ఏర్పడింది. ఎండలు ఉంటేనే కాని వరి కోత యంత్రాలు నడిచే పరిస్థితి లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గొళలు రాలిపోయే ప్రమాదం ఉంది



-ఆడెపు భీమన్న రైతు, శ్రీరాంనగర్

ఈపాటికే వరి కోతల సమయం దాటిపోయింది. కోత దశలో వర్షాలు పడితే గొళలు కుళ్లి రాలిపోతాయి. గొళలు రాలిపోతే ధాన్యం దిగుబడి బాగా తగ్గుతుంది. పది రోజులు వాన పడకుండా ఉంటే వరి కోతలు పూర్తవుతాయి.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ యువకుడిపై దాడికి నిరసనగా ఐటీడీఏ పీఓకు శుక్రవారం వినతిపత్రం ఇవ్వడానికి వస్తున్న ఆదివాసీ ఉద్యమకారులు కోవ విజయ్ కుమార్, కనక యాదవ్‌రావ్, మడవి శంకర్‌లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి తమ కస్టడీలో ఉంచుకోవడంపై తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క బాపురావ్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని ఈనెల13న ఆదివాసీ యువకుడు మర్సుకోల లక్ష్మణ్‌పై దాడి చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏజెన్సీలో ఇలాంటి అలజడికి కారకులైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించి, ఘటనలో గాయపడిన మర్సుకోల లక్ష్మణ్‌కు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. పోలీసులు అక్రమ అరెస్టు చేసి తమ కస్టడీలో ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బేషరత్తుగా వాళ్లని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, పుష్పరాణి, రేణుకా, వరుణ్, బాదిరావు, జంగు, ఎక్నాథ్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన జొన్న పంటలను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందవద్దని రైతుకు భరోసా ఇచ్చారు. అలాగే తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేవిధంగా చూస్తానని అన్నారు. మార్కెట్ యార్డ్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పుడు మూడు కాంటాలతోనే కొనుగోలు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేకు రైతులు విన్నవించారు. తక్షణమే కాంటాలకు ఆరుకు పెంచి రెండు రోజుల్లోనే పూర్తి ధాన్యం కొనుగోలు చేయాలనీ అధికారులను ఆదేశించారు. అనంతరం హమాలీల సంఘం నాయకులు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈఓ స్వామి, మార్కెట్ సెక్రటరీ, మనోహర్, కన్వీనర్ నారాయణరెడ్డి, మండల నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్, ఎలక రాజు, ప్రశాంత్, సుధీర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

తాత్కాలికంగా మూతపడిన థియేటర్లు

- వారం రోజుల పాటు బంద్
- ఎన్నికలు, ఐపీఎల్, ఓటీటీలు కారణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో థియేటర్‌లు తాత్కాలికంగా మూతపడ్డాయి. మాములుగా వేసవిలో హౌస్ ఫుల్ కలెక్షన్‌లతో కిటకిట లాడే సినిమా హాళ్ల చెప్పుకోదగ్గ చిత్రాలు విడుదల కాకపోవడంతో శుక్రవారం నుంచి పది రోజుల పాటు మూతపడనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 17 నుంచి వారం రోజుల పాటు సినిమా థియేటర్లు బంద్ పాటిస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జన్నారం, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, భైంసాలో ఉన్న 15కి పైగా ఉన్న థియేటర్లు మూసివేశారు. మారుతున్న సాంకేతిక ప్రభావంతో ఓటీటీల్లో కోరుకున్న సినిమా అనుకూలమైన సమయంలో ఇంట్లోనే తిలకించే అవకాశం రావడమే ముఖ్యకారణంగా చెబుతున్నారు. ఐపీఎల్ సీజన్ ప్రభావం, పెద్ద హీరోల సినిమాల సందడి లేకపోవడంతో థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య భారీగా తగ్గింది. ఇదే సమయంలో తెలుగు చిత్రసీమ నుంచి విడుదలయ్యే చలనచిత్రాల సంఖ్య కూడా తగ్గడంతో తాత్కాలికంగా వెండితెరకు విరామం పడింది. ఎన్నికలు, ఐపీఎల్ టోర్నమెంట్, పెద్ద సినిమాలు విడుదల కాకపోవడంతో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఒక్కో షోకు కనీసం ఇరవై మంది కూడా దాటకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక ఐపీఎల్ క్రికెట్ పోటీల కారణంగా ఫస్ట్ షో, సెకండ్ షో ప్రదర్శనలు ఉండటం లేదని యాజమాన్యాలు చెబుతున్నాయి. విద్యార్థులకు సెలవులు ఉండే వేసవి సెలవుల్లోనే సాధారణంగా పెద్ద సినిమాలు విడుదలై సందడి చేసేవి. ప్రస్తుతం పరిస్థితులు తారుమారైనట్లు కనిపిస్తోంది. వేసవి సీజన్‌లో సరైన సినిమాలు రాకపోవడం, చిన్న సినిమాలు వచ్చినా వాటికి ప్రేక్షకుల నుంచి స్పందన ఉండకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోంది. వసూళ్లు ఆశాజనకంగా లేకపోవడం, నిర్వహణ భారం పెరగడంతో తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ తాత్కాలికంగా థియేటర్‌లను మూసివేయాలని నిర్ణయించింది. ఈనెల 26 నుంచి ఐపీఎల్ సీజన్ ముగియనుండగా, జూన్ నాలుగున ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఆ తర్వాత వరసగా పెద్ద హీరోల సినిమాలు క్యూలో ఉండటంతో థియేటర్లకు పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తమవుతోంది. శుక్రవారం నుంచి ఈనెల 23 వరకు థియేటర్‌లను మూసివేసి ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్వహణ ఖర్చులు భారంగా మారడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరిస్థితి నెలకొందని, ఈ విషయాన్ని సినీ ప్రియులు గమనించాలని పేర్కొన్నారు.



దోస్త్ డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

- మూడు విడతల వారిగా అడ్మిషన్లు
- కొనసాగుతున్న మొదటి విడత
- కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు
- జిల్లాలో నాలుగు ప్రభుత్వ కళాశాలలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని, మూడు విడతల వారిగా ప్రవేశాలు చేపడుతున్నట్టు ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అచ్చి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ప్రభుత్వ డీగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మే 6 నుంచి మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని రూ.200 రుసుముతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఈ నెల 20 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, జూన్ 6న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 7 నుంచి 12 వరకు కేటాయించబడిన కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిర్దేశించిన తేదీల ప్రకారం రెండో దశ, మూడో దశలో అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉట్నూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్‌లో రెండు మొత్తం నాలుగు ప్రభుత్వ డీగ్రీ కళాశాలలు జిల్లాలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నచ్చిన కోర్సులు వివిధ మాధ్యమాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అనుభవజ్ఞులైన వారితో బోధన ఉంటుందని, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, లైబ్రరీ అందుబాటులో ఉన్నాయన్నారు. టీఎస్‌కేసీ ద్వారా ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాలు, వందల్లో కంప్యూటర్ సిస్టమ్‌లు ఉన్నాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలంటూ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే తమ కళాశాలలో అడ్మిషన్లకు సంబంధించి దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. డిగ్రీలో ప్రవేశాలు పొందే, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ సంబంధిత అనుమానాల నివృత్తి కోసం, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక లోపాలను సరిదిద్దుకోవడానికి, విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్న హెల్ప్ లైన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ట్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జలగం అనిత, ఉట్నూర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్ రావ్, దోస్త్ కోఆర్డినేటర్ డా.నర్సింగ్‌రావ్ ఉన్నారు.

అమ్మ ఆదర్శ పనులను పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టాల్సిన కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనులను జూన్ 10లోగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సెలెక్ట్ చేసిన మొత్తం 678లో 668 కమిటీ ఏర్పాటై అకౌంట్ ఓపెన్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డు, మేజర్, మైనర్ మరమ్మత్తులు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులు నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని అన్నారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ తదితర వాటిని రిపేర్ చేయించుకోవాలనీ, టాయిలెట్స్ లేనిచోట కొత్తవి నిర్మాణం చేపట్టాలని తెలిపారు. పాఠశాలల్లో పనులు చేపట్టక ముందు, పనులు చేపట్టిన తర్వాత వాటి ఫోటోలను తీసి పంపించాలని తెలిపారు. ఈ క్రమంలో మండలాల వారీగా ఒక్కొక్కరిని వారి పరిధిలో ఉన్న పాఠశాలల పురోగతిని అడిగి తెలుసుకొని, ఎక్కడెక్కడ ఇంకా పనులు ప్రారంభించలేదో త్వరగా ప్రారంభించి, జూన్ 10లోగా పూర్తి చేయాలని, జూన్ 12న పాఠశాలలు ప్రారంభించబడతాయి కనుక ఆ లోపే పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్, డీఈఓ ప్రణీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదపరుస్తున్న ప్రకృతి



నవతెలంగాణ-తలమడుగు

ప్రకృతి అందం అంటే అందరికీ ఇష్టమే, రావిచెట్టు చిగురించిన ఆకులతో అందంగా కనిపిస్తూ ప్రయాణికులను ఆకర్షిస్తోంది. కాసేపు సేద తీర్చుకోమని చెప్పకనే చెబుతోంది. మండల కేంద్రం నుంచి రుయ్యాడి మీదుగా సకినాపూర్, బరంపూర్ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులను, రైతులను ప్రకృతి అందాన్ని పంచడంతో పాటు నీడనిస్తూ ప్రజల మనస్సును ఆహ్లాదపరుస్తోంది రావి చెట్టు. ఎండకాలంలో ప్రారంభంలో రావి చెట్టు ఆకులు మొత్తం రాలిపోయి కనిపించిన చెట్టు, ఇప్పుడు చిగురించిన ఆకులతో ప్రయాణికులకు అందాన్ని, నీడని పంచుతోంది.



కంది శ్రీనివాస్‌రెడ్డిపై ఫిర్యాదు



నవతెలంగాణ-తాంసి

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి మాజీ టీపీసీసీ కార్యవర్గ సభ్యురాలుపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో ఖప్పర్ల గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం సభ్యులు మాట్లాడుతూ ఒక మహిళ అని చూడకుండా డబ్బు బలంతో నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని అన్నారు. వెంటనే కంది శ్రీనివాస్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌడాల మహేందర్, సంతోష్, గంద్రత్ అశోక్, భగువాండ్లు, ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని డీఎస్‌ఓ నందిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల కారణంగా వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలని అన్నారు. మిల్లులకు పంపిన రైతుల ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని, డీసీఎంఎస్ ఇన్‌చార్జి జాదవ్ గంగాధర్‌కు సూచించారు.

చోరీ కేసులో రెండు నెలల జైలు

నవతెలంగాణ-తలమడుగు

చోరీ కేసులో రెండు నెలల సాధారణ శిక్షను శుక్రవారం పీసీఆర్ కోర్టు తీర్పును వెలువరించినట్టు ఎస్సై ధనశ్రీ తెలిపారు. మండలంలోని సుంకిడి గ్రామ శివారులోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మార్చి 25న మహారాష్ట్ర మండ్వా గ్రామానికి చెందిన దౌడీవార్ రాజేశ్వర్ రూ.7,950లను దొంగలించగా రెండు నెలలు సాధారణ శిక్ష జిల్లా కోర్టు అమలు చేసింది. ఎస్సై ధనశ్రీ కేసు దర్యాప్తు చేసి, చార్జిషీట్ కోర్టుకు సమర్పించగా, నింధితుడు అయిన దౌడీవార్ రాజేశ్వర్‌కు శుక్రవారం ఆదిలాబాద్ పీసీఆర్ కోర్టు 2 నేలల సాధారణ జైలు శిక్ష విధించిందని తెలిపారు.

జాబ్‌కార్డ్ ఉన్న కూలీలకు వంద రోజులు పని కల్పిస్తాం : ఏపీఓ



నవతెలంగాణ-నార్నూర్

జాబ్‌కార్డ్ కలిగి ఉన్న ప్రతి కూలీకి ఉపాధి హామీ చట్టంలో భాగంగా వంద రోజులు పని కల్పిస్తామని ఏపీఓ జాదవ్ సురేష్ అన్నారు. శుక్రవారం రోజ్‌గార్ దివస్ సందర్భంగా బలాన్‌పూర్ గ్రామ పంచాయతీలో క్షేత్ర స్థాయిలో కూలీలు నిర్వహించే పనులపై అవగాహన కల్పించారు. నిర్వహించే పనులను బట్టి కొలతల ప్రకారం డబ్బులు వస్తాయని పనులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతి నెల మూడో శుక్రవారం నిర్వహించే రోజ్‌గార్ దివస్‌ను జామడ గ్రామ పంచాయతీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. టీఏలు సాదిక్, వికాస్, సచిన్, జ్యోతి, లావణ్య ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మెట్‌లు ఉన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే పాయల శంకర్‌పై ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రాల నగేష్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే పాయల శంకర్ భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, విచారణ చేయించాలని హితవు పలికారు. ప్రజల అభిమానంతో పాయల శంకర్ గెలిచారని, ఎలాంటి తప్పులకు పాల్పడలేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి పాలయ్యారని, ఓటమిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. మండలంలోని పీచర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాలలో బాలికల మూత్రశాలలు, మరుగుదొడ్లు నీటి సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, చిన్న చిన్న మరమ్మతులు, విద్యుత్ సదుపాయము త్వరితగతిన మూడు రోజుల్లో పూర్తి చేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు హేమలతకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ రవీందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఫాతిమా, ఎంపీడీఓ రామ్ ప్రసాద్, ఎంఈఓ మధుసూదన్, మండల వర్క్ ఇన్స్‌పెక్టర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయికృష్ణ, మాజీ సర్పంచ్ బుర్రి లతా భూమేష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా, శిశుఅభివద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం తరపున ఇవ్వనున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీడబ్ల్యూఓ భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-2025 సంవత్సరానికి గాను అందించనున్న రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు 6 నుంచి 18 ఏళ్ళలోపు బాలబాలికలు అర్హులని, ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీతో పాటు ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఆసక్తిగలవారు దరఖాస్తులను 31 జూలై 2024 లోపు అవార్డ్స్.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9491460658 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పంట పొలాల్లో తాము వేసుకున్న బోర్ వెల్‌లకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని గుండి గ్రామస్తులు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాల్లో బోర్ వెల్ వేసుకున్నామని అయితే త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వృథా పోతుందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండి మాజీ సర్పంచ్, సేండె దత్తు, గ్రామ రాజు పటేల్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-దహెగాం

వరి కొనుగోలు తూకంలో రైతులను మోసం చేసిన వ్యవసాయ సహకార సంఘం అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు, వ్యవసాయ కార్మిక, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులతో కలిసి మండలంలోని ఒడ్డుగూడలో రైతులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంట తీస్తున్న రైతులను వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం మోసం చేయడం సరికాదన్నారు. ఒడ్డుగూడలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, ఆ అధికారులు రైతులను బెదిరించి క్వింటాల్‌కు ఆరు కిలోల వరకు కోత విధిస్తున్నారని తెలిపారు. వాస్తవంగా సంచికి కేవలం 500 గ్రాములు కోత పెట్టాలని కానీ నిబంధనలకు విరుద్ధంగా కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. కోత విధించడంతోపాటు తూకంలో మోసం చేస్తున్నారన్నారు. రైతులను మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, మండల కార్యదర్శి నల్లి దామోదర్, రైతులు రౌతు సత్తన్న, రౌతు శంకర్, రౌతు చంద్రు, అనిశెట్టి రాజన్న, దందేర శంకర్, దందేర యశోద పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు జిల్లా వాసి ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు చెందిన ఆవిడపు ప్రణయ్ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందజేసే మహాత్మ జ్యోతిబాపూలే జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. అవార్డును జూన్ 10వ తేదీన పూణేలో నిర్వహించే వెస్ట్రన్ ఇండియా బహుజన రైటర్స్ నాలుగవ కాన్ఫరెన్స్‌లో అందజేయనున్నట్లు తెలిపారు. విద్యరంగ, నిరుద్యోగ సమస్యలపై పోరాడుతూ సామాజిక సేవ చేస్తున్నందుకు అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. అవార్డుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న ప్రణయ్ మాట్లాడుతూ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తనపై ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

నాణ్యమైన విత్తనాలను అందించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని రవీంద్రనగర్-1లోగల వితనాల దుకాణాలను తనికి చేశారు. ఎవరైనా డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు, ఎరువులు అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులకు విత్తనాలు అమ్మిన సమయంలో తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని అన్నారు. రైతులు కూడా బిల్లులను పంట కోతకు వచ్చే వరకు భద్ర పరుచుకోవాలి అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినచో లైసెన్స్ రద్దు చేస్తాం అన్నారు. అలాగే ఎరువుల ధరలు అదిక ధరలకు అమ్మకూడదని సూచించారు. ఎవరైన అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే మండల వ్యవసాయ అధికారికి సమాచారం ఇవ్వాలి అన్నారు. ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, డీలర్లు ఉన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచేలా కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ఆదాయం పెంచేలా సిబ్బంది కృషి చేయాలని డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చిన నేపథ్యంలో ఎండి ఆదేశాల మేరకు డిపో పరిధిలోని ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయం పెంచడానికి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించే దిశగా సిబ్బంది కృషి చేయడంతో పాటు ఆదాయం మరింత పెంచేలా ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టిఐ సరియా, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పక్కాగా చేపట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర కమిషనర్లు, అధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్య, పౌరసరఫరాల శాఖ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పనుల నిర్వహణ, ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని 685 ప్రభుత్వ పాఠశాలలలో పనులు చేపట్టడం జరిగిందని, ప్రతి పాఠశాలలో విద్యుదీకరణ, తాగునీరు, మూత్రశాలలు, తరగతి గదులలో మరమ్మత్తులు, బాలికలకు ప్రత్యేక మూత్రశాలల ఏర్పాటు తదితర పనులపై పర్యవేక్షిస్తూ నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఫర్నీచర్, పెయింటింగ్‌తో పాటు విద్యా సంవత్సరం ప్రారంభంలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 37 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతుల వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని జిల్లాలో ప్యాకింగ్ చేయబడిన రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజావాణి, ధరణి కార్యక్రమాలలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో ఏకరూప దుస్తులు అందజేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు ఏకరూప దుస్తులను జూన్ 12వ తేదీలోగా అందించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తుల కోసం పంపిణీ చేయబడిన క్లాత్‌ను జిల్లా కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో డీఈఓ అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం కంటే ముందే దుస్తులు పంపిణీ చేయాలన్నారు. విద్యార్థుల కొలతల ఆధారంగా క్లాత్‌ను అందజేయాలని సూచించారు. మండలాల్లో ఏర్పాటు చేసిన సెంటర్ల ద్వారా పని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పార్మి అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని 25322 విద్యార్థినులు, 22926 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. దీనికి గాను 1,96,031 మీటర్ల బట్టను కత్తిరించి రేపటిలోగా మండలాలకు చేరే విధముగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన వివిధ సెంటర్లలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మెంబర్లతో దుస్తుల్ని కుట్టిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్ డైరెక్టర్ రామకృష్ణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కటకం మధుకర్ పాల్గొన్నారు.

ఛలో బస్ భవన్ జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న నిర్వహించే ఛలో బస్ భవన్ కార్యక్రమానికి ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. ఛలో బస్ భవన్ కరపత్రాలను కార్మికులతో కలిసి డీపో ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలకమైన ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. గత పది సంవత్సరాల నుంచి ఆర్టీసీ కార్మికులు అష్టకష్టాలు పడ్డారన్నారు. ఆర్టీసీ కండక్టర్లను డ్రైవర్లను విడగొట్టి పాలించే ప్రక్రియకు చరమగీతం పాడాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. పెండింగ్ పీఆర్‌సీలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టే ఛలో బాస్ భవన్‌కు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని అప్పుడే సమస్యల పరిష్కారం మవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి టి.దివాకర్, ఆర్టీసీ కార్మికులు ఆయుబ్, రాజన్న, ఎండీ పాషా, రిటైర్మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే మల్లేష్, తాజోద్దీన్ పాల్గొన్నారు.

స్టాటర్లను కాలబెట్టిన దుండగులు

నవతెలంగాణ-కౌటాల



లిఫ్ట్ ఇరిగేషన్ స్టాటర్లను దుండగులు తగులబెట్టారు. గుండాయిపేట్ సమీపంలోని వార్ధ నది ఒడ్డున ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించారు. కొన్ని మోటార్లు, స్టార్టర్‌లు ఉండగా రెండు మూడు రోజుల్లో రిపేర్ పనులు మొదలు పెట్టేందుకు అధికారులు అన్ని సిద్ధం చేసుకున్నారు. ఇంతలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైర్ దొంగలించేందుకు వచ్చి అక్కడున్న మూడు స్టార్టర్లకు నిప్పు పెట్టారు. గతంలో దొంగతనాలు జరిగిన ఘటనల నేపథ్యంలో గ్రామస్తులు రాత్రి వేళ లిఫ్ట్ ఇరిగేషన్‌పై కన్నేసి ఉంచారు. గురువారం రాత్రి 9గంటల సమయంలో మంటలు గమనించి వెళ్లి చూడగా లిఫ్ట్ లోపలి స్టార్టర్లు కాలుతున్నట్లు గుర్తించారు. వెంటనే వాటిని ఆర్పేందుకు ప్రయత్నించారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉండడంతో అక్కడి వారా? లేక ఈ ప్రాంతం వాళ్ల పనా? అన్నది తేలాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సాగునీరు అందించేందుకు మరమ్మతులు పనులు చేయడానికి సిద్ధమవుతుంటే దొంగలు కాపర్ కోసం ఇలా తగులబెట్టడం పట్ల రైతులు మండిపడుతున్నారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామీణ వైద్య సేవలో ముఖ్యమైన ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యల పరిష్కారంతోపాటు వైద్య సేవలో గుర్తింపు ఇచ్చేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ వివిధ మండలాల్లోని ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.



మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పచ్చదనాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని, మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆకస్మికంగాతనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరందించి తగు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలోని పండ్ల మొక్కలకు సంబంధించిన వివరాలను పంచాయతీ కార్యదర్శి, నర్సరీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి సెలవులు వృథా చేసుకోవద్దు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా ఇతర నైపుణ్యాలను నేర్చుకోవాలని బురదగూడ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు ఎనగంటి భిక్షపతి సూచించారు. 'రీడ్ టు రూం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పిల్లల్లో పఠన నైపుణ్యం పెంపొందించేందుకు రూం టు రీడ్ బోధకురాలు గోపవరం పద్మశ్రీ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన కథలను పిల్లలకు అర్థవంతంగా చదివి వినిపించారు. విద్యార్థులతో పఠన నైపుణ్యం పెంపొందించే విధంగా బొమ్మలను చూపించి పదాలు, వాక్యాలు, కథలను చెప్పించారు. వేసవిలో పిల్లల సమయాన్ని వృథా కాకుండా ఈ కార్యక్రమం ద్వారా విజ్ఞానం పంచుకుంటారని తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఆశ్రమానికి అనాథ తరలింపు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన అనాథ నాయిని కీర్తిని సామాజిక కార్యకర్తలు సిద్ధం పెంటయ్య, చప్పిడి ప్రకాశ్ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి యువ శక్తి అనాథ ఆశ్రమానికి తరలించారు. బాలిక తల్లిదండ్రులు ఐదేండ్ల క్రితం మృతి చెందారు. మానసిక స్థితి సరిగా లేని బాలిక గ్రామంలో తిరుగుతుండేది. అనాథ ఆశ్రమ నిర్వాకులు డాక్టర్ ముల్కల కుమార్‌కు సమాచారం అందించి గ్రామస్తులు కత్తెర్ల భీమేష్, నాగపురి మోహన్ సహకారంతో ఏఎస్సై యాదవ్, సిబ్బంది చంద్రశేఖర్ సమక్షంలో బాలికను ఆశ్రమానికి తరలించారు.

నేటి దళిత సంఘాల ధర్నా వాయిదా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నా తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎస్సీ, ఎస్టీల భూములు కొంతమంది తీసుకోవడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టడానికి నిర్ణయించామని, తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

వంతెన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని అప్పపల్లి గ్రామానికి వెళ్లే కాలువపై వంతెన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అధికారులతో కలిసి వంతెన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుని అనంతరం ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు వేగంగా నాణ్యతతో కూడుకొని ఉండేలా చేయాలన్నారు. గత ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు వంతెన మంజూరు కోసం కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం యాదవ్, సప్తే శ్రీనివాస్ పాల్గొన్నారు.



నవ తెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

చెట్లను నరికిన వ్యక్తిపై కేసు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని తాళ్లపేట రేంజ్ పరిధిలోని తపాలాపూర్ గ్రామ సమీపాన ఉన్న అడవిలో ఆత్రం చిన్నరాజం అనే వ్యక్తి చెట్లను నరకడంతో అతనిపై అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆత్రం చిన్న రాజంను లక్షెట్టిపేట జడ్జి ముందు ప్రవేశపెట్టారు. అతనికి లక్షెటిపేట జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్‌ఓ సుష్మారావు తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లపేట రేంజ్ అధికారి సుష్మ రావు మాట్లాడుతూ అక్రమంగా చెట్లను నరికితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. అడవులను నరికి వేయడం నేరమన్నారు. ప్రతి ఒక్కరు చెట్లను రక్షించాలన్నారు. వాతావరణం కలుషితం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కృష్ణ ఎఫ్‌బీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంకర తరలిస్తున్న టిప్పర్లు సీజ్

నవతెలంగాణ-హాజీపూర్

జగిత్యాల నుంచి మంచిర్యాలకు అనుమతులు లేకుండా కంకర తరలిస్తున్న 3 టిప్పర్లను సీజ్ చేసి హాజీపూర్ పోలీస్‌స్టేషన్ కు తరలించినట్లు మైనింగ్ ఏడీ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఏడీ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల నుంచి మంచిర్యాలకు ఎలాంటి వే బిల్స్ లేకుండా తరలిస్తున్న సమాచారం మేరకు తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు చూపక పోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో పెట్టినట్లు తెలిపారు.



ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రియుడితో కలిసి భర్తను భార్య చంపిన సంఘటన మండలంలోని రహపెల్లిలో చోటుచేసుకుంది. మృతుడి అన్న ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం.. తన మరదలు కళావతి గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్‌తో తరచు ఫోన్‌లో మాట్లాడడంతో ఇంట్లో గొడవలు పెరిగాయని, గతంలో పంచాయతీ కూడా జరిగిందని తెలిపారు. దీనిపై గురువారం కూడా గొడవ జరిగిందని ఇదే క్రమంలో తన తమ్ముడు చునార్కర్ రవీందర్(38)ను ప్రియుడితో కలిసి తమ్ముడి ఇంట్లో ఉరివేసి చంపినట్లు తెలిపారు. మరదలు కళావతి ప్రియుడు అక్కపెల్లి రవీందర్ పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాజేశ్వర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భారీ వర్షానికి తడిసిన వరి ధాన్యం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు కురిసిన భారీ వర్షానికి వరి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. ఆ తడిచిన ధాన్యాన్ని రైతులు ఆరబోస్తున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు కేంద్రాల నుంచి గోదాంలకు తరలించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ప్రతిరోజు ఉదయం నుంచి ధాన్యాన్ని ఆరబోస్తూ సాయంత్రం వచ్చేసరికి మళ్ళీ వర్షం పడుతుందని దీంతో ధాన్యం తడిసి ముద్దయి, మాయిచ్చర్ రాకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటవెంటనే గోదాములకు తరలిస్తే తమకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని రైతులు వాపోతున్నారు. కుప్పలు కుప్పలుగా ఉన్న ధాన్యాన్ని కూడా వెంట వెంటనే తూకం వేయాలని, అధికారులను రైతులు వేడుకుంటున్నారు.

అందుబాటులోకి రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఈ వానకాలం సీజన్‌కు గాను పచ్చిరొట్ట విత్తనాలు అయిన జీలుగ విత్తనాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం-జెండా వెంకటాపూర్‌లో అందుబాటులో వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాలు శనివారం 18 మే నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. జీలుగ విత్తనం 30 కిలోల బ్యాగ్ ధర రూ.1116 రెండున్నర ఎకరాలకు ఒక బ్యాగు చొప్పున సరఫరా చేస్తామన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని లక్షెట్టిపేట క్లస్టర్ రైతులు లక్షెట్టిపేట, ఇటిక్యాల, ఉత్కూర్ గ్రామ రైతులు రైతు వేదిక, లక్షెట్టిపేట వ్యవసాయ విస్తరణ అధికారిణి ప్రసన్న, 9281036193ను జెండా వెంకటాపూర్ క్లస్టర్ రైతులు అయిన జెండా వెంకటాపూర్, తిమ్మాపూర్, లింగాపూర్, బలరావుపేట్, రంగపేట్, తలమల గ్రామ రైతులు రైతు వేదిక, జెండా వెంకటాపూర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారి గోవర్ధన్‌రెడ్డి 9281036192ని, దౌడేపల్లి క్లస్టర్ రైతులు అయిన దౌడేపల్లి, చందారం, చల్లంపేట, గ్రామ రైతులు రైతు వేదిక, దౌడేపల్లిలోని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, 928103619ను సంప్రదించాలన్నారు. వెంకట్రావుపేట్ క్లస్టర్ రైతులు అయిన వెంకటరావుపేట్, ఎల్లారం, కొత్తూరు, మోదేల గ్రామ రైతులు రైతు వేదిక, వెంకట్రావుపేట్‌లో వ్యవసాయ విస్తరణ అధికారిణి అనూష, 9281036195ను పోతేపల్లి క్లస్టర్ రైతులు అయిన పోతేపల్లి, గుళ్ళకోట, మిట్టపల్లి, లక్ష్మీపూర్ గ్రామ రైతులు రైతు వేదిక, సురారం నందు వ్యవసాయ విస్తరణ అధికారిణి ఇర్ఫానా యాస్మిన్ 9281036194 నెంబర్‌ను సంప్రదించి టోకెన్ తీసుకొని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం-జెండా వెంకటాపూర్, లక్షెట్టిపేటలో విత్తనాలు పొందుతారని తెలిపారు.

అధిక సాంద్రత పత్తిసాగుపై అవగాహన



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులతో వివిధ విత్తన కంపెనీ ప్రతినిధులతో వచ్చే వానాకాలంలో అధిక సాంద్రత పద్ధతి సాగు నిర్వహణ, విధివిధానాలపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. కోట శివకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం జాతీయ పత్తి పరిశోధనా కేంద్రం నాగ్‌పూర్ సహకారంతో మంచిర్యాల జిల్లాలో 157.5 ఎకరాలలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేశామన్నారు. ముఖ్యంగా రాబోవు వానాకాలంలో 400 ఎకరాలలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుకు మంచిర్యాల జిల్లాను ఎంపిక చేశామని తెలిపారు. వివిధ రకాల నేలల్లో విత్తన మోతాదు, విత్తే దూరం, మొక్కల సంఖ్య పెరుగుదలను నియంతించే ఉత్ప్రేరకాల వాడకం, కలుపు, చీడపీడల యాజమాన్యంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఏడీఏ ఇంతియాజ్, వివిధ సీడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

జన్నారంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో మొదటి దశ ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కోర్సుల్లో ప్రవేశానికి మే 16 నుంచి జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు పూర్తి ధ్రువీకరణ పత్రాలతో ఐటీఐ వెబ్‌సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

ఒక వైపు వరి కోతలు ఇంకో వైపు వర్షాలు



పడిపోయిన వరి పైరు కోస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జైపూర్

వెంటాడుతున్న అకాల వర్షాలతో రైతులు ఆగమాగమవతున్నారు. పది రోజులు కూడ కానేలేదు. మళ్లీ కురిసిన అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. ఒక వైపు వరి కోతలు కొనసాగుతుండగా మరో వైపు వర్షాలు కురుస్తుండటంతో పంటలను కాపాడుకోవడం తలకుమించిన భారంగా మారిందని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. మండల పరిధలో కురిసిన అకాల వర్షాలతో రైతులు మరో మారు నష్టపోవల్సి వచ్చింది. గురువారం సాయంత్రం మొదలైన వర్షం శుక్రవారం సాయంత్రం వరకు కురిసింది. వరి కోతలు చివరిదశలో ఉండగా కురిసిన వర్షంతో వరి పంటను మరోమారు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోగా, కోతకు వచ్చిన పైరు పడిపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. పది రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న సమయంలో కురిసిన అకాల వర్షం ఆర్థికంగా నష్టపోవల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజుల క్రితం కురిసిన వడగళ్ల వానతో ఉమ్మడి మండలంలో 650 నుంచి 700 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరింతగా నష్టపోవల్సి వస్తున్నందున గ్రామ పంచాయతీల వారిగా పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించి నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

పంట నష్టాన్ని గుర్తించాలి

నక్క శ్రీనివాస్, శివ్వారం



ఇటీవల కురిసిన వడగళ్ల వానతో పాటు ఇప్పుడు కురుస్తున్న అకాల వర్షాలతో పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లించాలి. వరితో పాటు మామిడి పంటను నష్టపోయిన రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించాలి. తడి పొడి అనకుండా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి. నిబంధనలు పక్కన పెట్టి వచ్చి ధాన్యం వచ్చినట్టు కొనుగోలు చేసే విధంగా నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలి. కేంద్రాలకు తరలించినధాన్యం తడువకుండా ఉండటం కోసం అవసరమైన టార్పాలిన్లు సమకూర్చి సహకరించాలి. పంటలను నష్టపోయిన రైతులకు భరోసా కల్పించే విధంగా అధికారులు గ్రామాల్లో పర్యటించి బాసటగా నిలువాలి.

దెబ్బమీద దెబ్బ తగిలినట్లుంది

తగరం మొండయ్య, భీమారం



పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి దెబ్బ మీద దెబ్బ తగిలినట్లుంది. పది రోజుల క్రితం రాళ్లతో కూడిన వడగళ్ల వానతో వరి పంటతో పాటు మామిడి పంటను నష్టపోవల్సి వచ్చింది. ఇప్పుడు కురిసిన వర్షంతో మిగిలిందనుకున్న పంటను కూడా నష్టపోవల్సివస్తోంది. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోగా కోతకొచ్చిన వరి పైరు పడిపోవడం ఆర్థికంగా తీవ్రమైన నష్టాన్ని మూటగట్టుకోవల్సి వచ్చింది. పది రోజుల క్రితం పడిపోయిన పైరు మరో మారు కురిసిన వర్షంతో పూర్తిగా నేలనంటింది. పడిపోయిన పైరును కోయడం కన్నా వదలు కోవడం మంచిదనిపిస్తుంది.

బీసీ కులస్తులకు 50 శాతం సీట్లు కేటాయించాలి



నవతెలంగాణ-జన్నారం

బీసీ కులస్తులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని బీసీ కులాల ఐక్య ఉద్యమ పోరాట సమితి మంచిర్యాల జిల్లా కో-కన్వీనర్ బాలసాని శ్రీనివాస్ గౌడ్ కోరారు. శుక్రవారం పట్టణంలో బీసీ కులాల పోరాట సమితి మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులస్తులకు అన్ని పార్టీలు న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా వారి మేనిఫెస్టోలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయిస్తామని ప్రకటించారు. మరి గ్రామపంచాయతీ ఎన్నికల శంఖారావం మోగనున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీలు 12751 ఉన్నాయి. అనేది వాస్తవం. 42 శాతం రిజర్వేషన్‌ల ప్రకారం బీసీలకు 5355 కేటాయించాలి. కాని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2345 మాత్రమే బీసీలకు కేటాయించారన్నారు. కాంగ్రెస్‌కు ప్రచారం చేసే బీసీ నాయకులంతా గమనించాలన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపైన ప్రశ్నించాలన్నారు. బీసీ సంఘ నాయకులు అని చెప్పుకొని తిరుగుతూ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓటు వేయాలి బీసీలు అనే విధంగా బాహాటంగా ప్రకటించిన బీసీ సంఘం నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బీసీ సమాజం మేల్కోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కోకన్వీనర్ కడార్ల నరసయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, ముదిరాజు సంఘం మండల అధ్యక్షుడు దండెవేని, శ్రీధర్, ఉపాధ్యక్షుడు ఐలవేణి రవి, నాయీబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కే.నాగేందర్, రజక సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్, మేరు ధర్జీ సంఘం నాయకుడు మేడిశెట్టి సంతోషి, మున్నూరు కాపు సంఘం నాయకుడు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాయామంతో బీపీ నియంత్రించొచ్చు : జీఎం

నవతెలంగాణ-నస్పూర్

ప్రతిరోజు వ్యాయామం చేస్తే రక్తపోటును నియంత్రించుకోవచ్చని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నస్పూర్ డిస్పెన్సరీలో డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జీఎం పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల పరిరక్షణకు, వారి ఆరోగ్య పరిరక్షణకు సదుపాయాలు కల్పిస్తుందని, శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న డిస్పెన్సరీలలో ఉద్యోగులకు ఉద్యోగుల కుటుంబసభ్యులకు కావలసిన అన్ని పరీక్షలు నిర్వహించడానికి కావలసిన వైద్య సామాగ్రి అందుబాటులో ఉన్నాయని అన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ఉద్యోగులు బీపీ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా ఉండడానికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 40 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని, అదేవిధంగా వారి ఆహార అలవాట్లను తరచుగా పరిశీలిస్తూ సాధ్యమైనంత ఉప్పు వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవ నినాదాలు చేశారు. భావితరాలకు మంచి వాతావరణాన్ని ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా వీలైనంతవరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. అనంతరం డిస్పెన్సరీలో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, డాక్టర్ మురళీధర్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.



కాసిపేట-2 గని ఉద్యోగుల ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేష్ కుటుంబానికి గని ఉద్యోగులు అండగా నిలిచారు. ఉద్యోగులు విరాళాలు సేకరించి రూ.1,10,100 సమకూరిన మొత్తాని కుటుంబానికి అందించారు. తోటి కార్మికుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి సుభాష్ చంద్రబోస్, మైనింగ్ సర్దార్ కేతన్, వినోద్, టీబీజీకేఎస్ నాయకులు సారంగపాణి, సీఐటీయూ ఫిట్ కార్యదర్శి సురేష్, నాయకులు కారుకూరి తిరుపతి, రాజ కొమురయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులను సకాలంలో అందించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-కాసిపేట

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండలం సోమగూడెంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం అయ్యేలోగా ఏకరూప దుస్తులు అందించాలని అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాలకు ఆర్థికంగా చేయూత అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఏకరూప దుస్తులను స్వయం సహాయక సంఘాల మహిళలతోనే కుట్టించడానికి అవకాశం కల్పించడం జరిగిందని, ఈ అవకాశాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు సమయానికి అందించే విధంగా కృషి చేయాలని, స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు ఏకరూప దుస్తుల తయారీకి అవసరమైన బట్ట పంపించడం జరిగిందని, ప్రతి కేంద్రంలోను సుశిక్షితులైన మహిళల ద్వారా ప్రభుత్వ నిర్దేశించిన సమయానికి ముందుగానే నాణ్యమైన ఏకరూప దుస్తులు తయారు చేసి పాఠశాలలకు చేరవేసే విధంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, బెల్లంపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, బెల్లంపల్లి మండల విద్యాధికారి మహేశ్వర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

గిరిజనుల గుడిసెలు తొలగింపు

- భీమన్న దేవుడు, పోచమ్మ ఆలయాల ధ్వంసం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలాపూర్ గ్రామ సమీపంలో ఉన్న గిరిజన కొలం గూడాలో గిరిజనులు వేసుకున్న గుడిసెలను తాళ్ల పేట రేంజ్ అధికారులు, శుక్రవారం ఉదయం ధ్వంసం చేశారు. ఆ ఇళ్ల పక్కనే గిరిజనులు నిర్మించుకున్న భీమన్న దేవుని ఆలయం పోచమ్మ ఆలయాలని జేపీబీతో ధ్వంసం చేశారు. ఆ ఆలయాల పక్కనే ఉన్న రెండు గుడిసెలను పూర్తిస్థాయిలో ధ్వంసం చేసి సామాగ్రి అంతా ట్రాక్టర్‌లో తీసుకొని అటవీ, కార్యాలయానికి తరలించారు. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాలను నేలా మట్టం చేశారు. ఆ గుడిసెలలో ఉండే నిత్యవసర సరుకులను ధ్వంసం చేసి, ట్రాక్టర్లో వేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఆ గ్రామానికి చెందిన కుల పెద్దాయన, ఆత్రం రాజును అరెస్టు చేశారు. గత ఏడు సంవత్సరాల క్రితం నుంచి ఆ గూడెంలో భీమన్న దేవుని ఆలయం పోచమ్మ ఆలయాలను నిర్మించుకొని ఉంటున్నామని గిరిజనులు అన్నప్పటికీ, వారిపై అటవీ అధికారులు దౌర్జన్యం చేస్తూ, వారి గుడిసెలను కూలదోశారు. ఆ గిరిజనులు నిర్మించుకున్న గుడిసెలు ఆలయాలు అటవీ భూమిలో ఉన్నాయని వాటిని అటవీ అధికారులు, తాళ్లపేట ఎఫ్ఆర్‌ఓ సుష్మారావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ విషయంపై ఎఫ్ఆర్‌ఓ సుష్మారావును వివరణ అడగగా. అది అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్ట్ అని వాళ్ళు అక్రమంగా గుడిసెలు వేసుకున్నారని, వాటిని మాత్రమే తొలగించామని వారు వివరణ ఇచ్చారు. ప్రభుత్వ ఆటవి భూమిలో ఎవరు అక్రమంగా గుడిసెలు వేసినా వారిపై చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నామన్నారు.

అన్ని హంగులతో మైదానం నిర్మాణం

నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగుల పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం అన్ని హంగులతో మైదానాన్ని నిర్మించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ దీనిని సద్విని చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం న్యూ నాగార్జున కాలనీలో గల ప్రాణహిత మైదానంను సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మైదానంలో బాస్కెట్బాల్, వాలీబాల్ కోర్టులను సత్వరమే పూర్తి చేయాలని, మైదానంలో లైటింగ్ మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మైదానంలోకి ఎటువంటి వాహనాలు, పశువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వర్క్ షాప్ రవీందర్, బీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఇన్‌చార్జి బీజీఎం పర్సనల్ రాజేశ్వర్, వర్క్ షాప్ ఇంజనీర్ సతీష్ చక్రవర్తి, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ, సీనియర్ పీఓ పి కాంతారావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

పిల్లలతో సేద తీరుతూ..ఇంటి పనులు చేస్తూ..

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గత రెండు నెలలుగా ఎన్నికల హడావిడిలో కొనసాగిన నాయకులు ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో కొంత విరామం తీసుకుంటున్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి నియోజకవర్గ బాధ్యతలు తన భుజస్కందాల మీద వేసుకొని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం నిరంతరం కృషి చేసింది. ప్రస్తుతం ఎన్నికల ఫలితాలకు ఇంకా సమయం ఉండడంతో కుటుంబ సభ్యులతో గడుపుతోంది. ఇంటి పనులు చేస్తూ తనను కలవడానికి వచ్చిన పలువురికి స్వయంగా తేనీరు చేసి అందించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందిన సమయాన్ని ఇంటి సభ్యులకు కొంత కేటాయిస్తున్నట్లు తెలిపారు.

డప్పు కార్మికులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని షట్‌పల్లి గ్రామంలో డప్పు కార్మికులకు మాజీ సర్పంచ్ మేడి రవి దుస్తులు పంపిణీ చేశారు. తన తమ్ముడు జెడ్పీటీసీ భర్త మేడి సునీత తిరుపతి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికులకు దోవతులు, షర్టు, కండువాలు అందజేశామని తెలిపారు.

ఇష్టంలేని పెండ్లి చేశారని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి



ఇష్టంలేని పెండ్లి చేశారని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తేజాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వాంకిడి ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన వాడై బాపురావు కుమారుడు వాడై ఉమేష్(27)కు ఈ నెల 5న సుర్దాపూర్ గ్రామానికి చెందిన లెండ్గురే పోశెట్టి రెండవ కుమార్తెతో వివాహం చేశారు. పది రోజులు గడిచిన తరువాత గురువారం ఇంట్లో కూలర్ పనిచేయకపోవడంతో కొత్త మోటార్ తీసుకువస్తానని ఉమేష్ ఇంట్లోం నుంచి బయటకు వెళ్లాడు. కాసేపటికి తాను వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగానని తండ్రి బాపురావుకు ఫోన్ చేసి తెలిపాడు. వెంటనే వెళ్లిన తండ్రి ఎందుకు తాగావని అడగటంతో తనకు ఇష్టంలేని పెండ్లి చేశారని తెలిపాడు. వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరళించగా మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రకి తరళిస్తుండగా మార్గమద్యలో మృతిచెందాడు. ఈ మేరకు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేకరు ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుద్ఘాతంతో మేస్త్రీ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుద్ఘాతంతో ఓ తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండలం కౌఠ(బి) గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ రత్నాకర్ ఆదిలాబాద్ పట్టణంలోని సాయినగర్‌లోని ఓ ఇంట్లో తన మామతో కలిసి శుక్రవారం పని చేశారు. అయితే బాత్రూమ్‌కు స్లాబ్ వేసే క్రమంలో ఇనుప ఊచలు అమరుస్తున్న క్రమంలో ఆ ఊచ పైనున్న విద్యుత్తు తీగలకు తగలగా విద్యుద్ఘాతానికి గురయ్యాడు. వెంటనే రిమ్స్ తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి సుధాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు



నవతెలంగాణ-నిర్మల్

సోన్ మండలం న్యూవెల్మల్, బొప్పారం గ్రామంలో పేకాట స్థావరాలపై ఎస్సై సంతోషం రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఒక స్థావరంలో 11మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.43,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో స్థావరంలో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. సంబంధిత వ్యక్తులను అరెస్టు చేశారు.

విద్యుత్ షాక్‌తో గ్రామపంచాయతీ కార్మికుడి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యుత్ షాక్‌తో గ్రామపంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ మండలంలోని లింగుడ గ్రామానికి ఉద్ధవ్(30) దార్‌లోద్ది గ్రామానికి గ్రామపంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్న సందర్భంలో విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ సమస్య పరిష్కరించే క్రమం విద్యుత్ షాక్ తగిలి గాయాలయ్యాయి. వెంటనే108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్టు డబ్ల్యూ ఏఎస్సై సునీత తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉరేసుకొని ఎస్టీపీ ఉద్యోగి ఆత్మహత్య

నవతెలంగాణ-జైపూర్



ఉరేసుకొని ఎస్టీపీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కిరీటి(38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం లంచ్ బ్రేక్‌లో తన క్వార్టర్‌కు వచ్చి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విధులకు సంబంధించి పైఅధికారుల ఒత్తిడి కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కారోబారి బిక్కు సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-నార్నూర్

బిక్కు కారోబారి గ్రామానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం తాడిహత్నూర్ గ్రామంలో తెరివి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాథోడ్ బిక్కు గ్రామంలో కారోబారితో పాటు కాంగ్రెస్ పార్టీలో ఐదేండ్ల కాలం పాటు ఎంపీటీసీగా సేవలు అందించి మంచి గుర్తింపు పొందారని అన్నారు. చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, మాజీ సర్పంచ్ మధుకర్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, మాజీ జెడ్పీటీసీ బ్రీజులాల్, రాథోడ్ ఉత్తం, రెడ్డినాయక్, బాలాజీ కాంబ్లే, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తోడసం నాగోరావ్, పీఆర్ ఈఈ రాథోడ్ సురేష్ నాయక్, ఆడే డిగాంబర్, మెస్రం శేఖర్‌బాబు, మహేందర్, మాజీ ఎంపీటీసీ రమేష్, రాథోడ్ శేషరావ్, రాజు నాయక్, సోరాజి, శివాజీ పటేల్, వివిధ గ్రామాల నాయక్, కారోబారి పాల్గొన్నారు.



గ్రామాన్ని సందర్శించిన కేంద్ర జలవనరుల బృందం

నవతెలంగాణ-కౌటాల

జల వనరుల అవార్డ్ కోసం కేంద్రం ఎంపిక చేసిన గ్రామాల జాబితాలో చోటు దక్కించుకున్న కౌటాల గ్రామ పంచాయితీని శుక్రవారం కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ, కేంద్ర జల సంఘం అధికారుల బృందం వాస్తవ పరిస్థితిపై తనిఖీ చేశారు. అవార్డ్ కోసం దేశ వ్యాప్తంగా 185 గ్రామ పంచాయతీలను కేంద్రం ఎంపిక చేసింది. ఇందులో టాప్ 25లో తెలంగాణాలో ఏడు గ్రామాలను ఎంపిక చేశారు. ఇందులో బెస్ట్ విలేజ్ పంచాయతీ విభాగంలో కౌటాల గ్రామం ఎంపికైనట్లు కేంద్ర బృందం సభ్యుడు, కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సీనియర్ సైంటిస్ట్ దివాకర్ మహంతి తెలిపారు. ఈ మేరకు కౌటాల గ్రామ పంచాయితీలో టీమ్ మెంబర్, కేంద్ర జల సంఘం సబ్ డివిజన్ ఇంజనీర్ సతీష్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, ఐఈసీ కోఆర్డినేటర్ మల్లేష్‌లతో కలిసి పరిశీలించారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మాట్లాడి అవార్డ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం చెక్ లిస్ట్ ఆధారంగా పంచాయితీ తరపున అప్లికేషన్‌లో పొందుపరచిన పనులు, భూగర్భ జలాల పెరుగుదలకు చేపట్టిన పనులు వాటి





ద్వారా జరిగిన మేలును పరిశీలించారు. అదేవిధంగా వర్షపు నీరు ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చేసిన విధానాలు పనులు చూశారు. గ్రామ పంచాయితీ తరపున ఉపాధి హామీ ద్వారా చేసిన ఇంకుడు గుంతలు, ఫిష్ పాండ్, ఇతర పనుల్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివాకర్ మహంతి మాట్లాడుతూ నీటి సంరక్షణ, వినియోగం, వినూత్న ఆలోచనలకు, ఉపాధి కల్పన అమలు ఇలా అన్నింటికీ కలిపి వంద మార్కులు ఇవ్వడం జరుగుతుందని, సమగ్ర నివేదికను వాస్తవ పరిస్థితిని కేంద్ర జల వనరుల శాఖకు అందిస్తామని దీనిద్వారా అవార్డ్‌కు ఎంపిక జరుగుతుందని అన్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న కౌటాల గ్రామ పంచాయితీ ఈ అవార్డ్ కోసం పోటీ పడేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, జిల్లా అధికారులు, స్థానిక సిబ్బంది, ప్రజా ప్రతినిధులు భాగస్వామి కావడం పట్ల అభినందించారు. వీరితో పాటు బృందం సభ్యుడు పోషెట్టి, ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీడీఓ నసురుల్లా ఖాన్, ఈజీ ఎస్ ఏపీఓ పూర్ణిమ ఈసీ సంతోష్, వాటర్ షెడ్ టీఓ హైమద్, సెక్రెటరీ సాయి కృష్ణ ఉన్నారు.

పాఠశాల పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-కెరమెరి



జూన్ రెండవ వారంలోగా ఆదర్శపాఠశాలల్లోని చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి సందర్శించారు. పాఠశాలలో కలియ తిరుగుతూ తరగతి గదులను పరిశీలించారు. జూన్ 12నాటికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాలలో చేపడుతున్న మౌలిక సదుపాయాలు సమకూర్చాలని సూచించారు. ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే అదనంగా బడ్జెట్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏకరూప దుస్తులను సకాలంలో కుట్టు మిషన్ కేంద్రానికి పంపించి, నిర్ణీత సమయంలో విద్యార్థులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రంథాలయంలో తగిన పుస్తకాలు లేవని పాఠశాల సిబ్బంది తెలుపగా పరిశీలిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు ఇంకారాలేదని తెలుపగా, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్ కుమార్, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీఓ కృష్ణమూర్తి, మండల నోడల్ అధికారి ఆడే ప్రకాష్, ఎంపీఓ అంజద్ పాషా పాల్గొన్నారు.

కుట్టు పనులు త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసే ఏకరూప దుస్తులను పాఠశాలల పున : ప్రారంభం అయ్యేలోపు అందజేయాలని టైలరింగ్ ఏజెన్సీలకు ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కిష్టంపేట గ్రామపంచాయతీలోని రాజ్యలక్ష్మి టైలరింగ్ ఏజెన్సీ ద్వారా ఏకరూప దుస్తుల కుట్టు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేసే దుస్తులను జూన్ 10లోపు కుట్టడం పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వాసాల ప్రభాకర్, ఏపీఎం పూమా నాయక్, సిఆర్పి నాగరాజు, వివిధ స్వయం సహాయక గ్రూపు మహిళలు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

25 ఏండ్లకు ఒకచోట చేరి.. జ్ఞాపకాలు నేమరు వేసుకొని..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డైట్ కళాశాలలో 1998-99 బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు 25 సంవత్సరాలు తరువాత ఒక చోట చేరి సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం ఓ ఫంక్షన్ హాలులో చదువుకున్న సమయంలో చేసిన అల్లరి, ప్రస్తుతం చేస్తున్న వృత్తుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారికి బోధించిన అధ్యాపకులను సత్కరించి, వారి ఆశీర్వాచనలు తీసుకున్నారు. బ్యాచ్‌లో 120 మంది ఉండగా కొందరు ఇతర శాఖల్లో ఉండగా మిగిత వారు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. కొన్ని రోజుల కింద ఆదిలాబాద్, మంచిర్యాలకు చెందిన సుహాసిని, సమ్మయ్య, విద్యాసాగర్ రెడ్డి, శైలేందర్, లక్ష్మణ్ రావు మిత్రుల నెంబర్లను సేకరించి వాట్సాప్ గ్రూప్ తయారు చేశారు. అందరికి ఒకే వేదికపై ఆదిలాబాద్ వాసులు తీసుకువచ్చి శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉత్సహంగా గడుపుతూ పాత రోజులను నేమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉర్మిల, భాగ్య, వీణ, కవిత, జయసుధ, ప్రవీణ్, భగవాండ్లు, శ్రీనివాస్, ఆనంద్, స్వామిరెడ్డి, విజయ్, చింతమన్ పాల్గొన్నారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఆటల్లో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం సమయంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఇంటికే పరిమితమవుతున్న పిల్లలు ఉదయం..సాయంత్రం పూట క్రికెట్, వాలీబాల్, కబడ్డీతో పాటు వివిధ రకాల గ్రామీణ క్రీడలను ఆడుతూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతున్నారు. ఆ చిత్రాలే ఇవి..

నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కాసిపేట

సోమగూడెం బైపాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హన్మకొండ జిల్లా నడికూడ గ్రామానికి చెందిన జగన్నాదుల దేవేందర్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం..జగన్నాదుల రాజు, తమ్ముడు దేవేందర్‌తో పాటు మరో వ్యక్తి తుంగపిండి రమేష్ ఐచర్ వ్యాన్‌లో రెబ్బెనకు పని నిమిత్తం వెళ్తున్నారు. సోమగూడెం బైపాస్ రోడ్డు వద్ద డ్రైవర్ మంగలి ప్రసాద్ అతి వేగంగా గుర్తు తెలియని లారీని వెనుల నుంచి ఢీకొట్టాడు. దేవేందర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తుంగపిండి రమేష్‌కు గాయలయ్యాయి. మృతుడి అన్న జగన్నాదుల రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నిర్ణీత గడువులోపు వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు రైతులకు సరిపడినన్ని టార్పాలిన్ లు, దాన్యం సంచులను అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యపు వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మాత్రమే రైతుల నుంచి వరి కొనుగోలు చేపట్టాలని, అదనపు ధాన్యాన్ని రైతుల నుంచి తీసుకోవద్దని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎస్ఓ శ్రీకళ, సివిల్ సప్లయిస్ డీఎం నందిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, డీసీఓ నర్సయ్య, ఏడీ మార్కెటింగ్ ఆశ్వాక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.